# సంగెం

లోపలా బయటా వుంటది బిడ్డా
మడుగు
మెరుస్తుంటది వాక్యం కాపిశ్కలాగ
ఎగిరిపట్టుకోవాలె దాన్ని
కలకూ చింతకూ మధ్య
వేలాడుతుంటది
తాటాకు జుమ్కలాగ
చెడ నీల్గుతది వారి

కల్లుకంపౌండ్లల్ల గుడంబ బట్టీలల్ల మెహందీ చెమట సుక్కలల్ల
పనిముట్ల పుండ్లల్ల రక్త పంకాలల్ల వొంటరి కాష్ఠాలల్ల
పతాలేని ప్రేమలల్ల దిక్కులేని సావుల కడుపు కోతలల్ల
కుత్కెలో కూడులాగ వుంటది బిడ్డా
వాక్యం
పేగులోపల కన్నీటి పువ్వులాగ
జహన్నుమ్ జన్నత్‌ల మధ్య
చెడనీల్గుతుంటది వారి
దానికి రెండు వైపులా శబ్దముంటుంది
మధ్యలో
పెను నిశ్శబ్దపు ధార కూడా...

ఏడూపాయల నడుమ బుక్కా గులాలతో శిగమెత్తిన
శివసత్తిలో

కాటమరాజు కేకలో గొల్ల సుద్దుల్లో గుండె కొలకుల్ని

వొత్తి

అమర్చే అజంతాక్షుడి నిర్జన గ్రామం ముచ్చట్లలో

వుంది వాయీ...

కవిత్వం...

నాయనా నేనిపుడు

అలీఫ్ బే సే తే సే ని

అమ్మా... ఆయీని

ఏక్‌మినార్ దుగుట్లో వొదిగిన

కబూతరాంతరంగ భీతిని

లుంబినిలో బేర్‌లమ్ముకుంటున్న

సాంస్కృతిక దుఃఖాన్ని

కొడుకా మెహబూబలీ పాషా సర్వాయిపాపడా

దాశరథీ కరుణాపయోనిధీ కుమ్మరి పాపమ్మ ప్రేమికుడా

ఏం జెప్పాలె బిడ్డా...

బాషకు బొడ్డుతాడు ఎక్కడ తెగిందో ఏమో...

జాంబవంతుడా నువ్వే దిక్కు

వాక్యమంటే చిందు బాగోతమయ్యా...

దాని రక్తమారదు పెనురక్త చాపం

దాని గొంతెప్పుడూ జియాగూడ కబేల

గన్నేరు కాయల్ని తంగేడు మొగ్గల్ని

డొక్కలో కుక్కుకుంటది

దాన్నే పాము కాటేసిందో
దాన్నే కొరకాలిప్పుడు
దూప... దూప... సైసుబిడ్డా... దూప...

దమ్మమూర్తీ... వొకసారైనా చూడు
నా మూడో నాలుగో ఐదో ప్రపంచాన్ని కాపాడు
నా రాళ్ళను కాపాడు
నా సాయవానును కాపాడు
నా ఉత్తర దిక్కునూ దాని చెల్కనూ కాపాడు
వెనుకబడినతనాన్ని మనువాడిన
నీలపు ద్రవసీసంలో కనుగుడ్డునై ఉడుకుతూన్న
శెవ్వ ఇదేం బతుకు

ఏమీ తెల్వని నేర్వని చీకటి
ఏడు కట్ల సవారి కాష్ఠం
దుమ్ముగ మంటలేస్తది
పువ్వులు నల్లగైతున్నయ్
ఆకులు నల్లగైతున్నయ్...

బిడ్డో కోశిన భాగాలేవీ పాశిన బలగాలేవీ శాయన్నా
నాయన్నా కంచం కాటికి బోయిందీ ఆటలు పాటలు
కతలన్నీ రాగిరి వర్ణం నుసిగా పాడిన సంగెం సొంతం
కాష్ఠం పిలగా...

శబ్దకారుడా

సక్లం ముక్లం పడ్డది వాక్యం

సైబర్ ధ్యానం కమ్మింది

బార జాపించు చెర విడిపించు

ఇప్పుడిక

కవిత్వమంటే వెనుకకు తిరిగి నడిచే కాంతి

ఎండిన తాలాబ్‌ల నెర్రెల్లోని

దక్షిణపు గాలి

యశోధరమ్మ గర్భసంచి

వొల్లంగి పిట్టె.

సిద్ధార్థ

(1997)